

కొత్త ఏడాదిపై కోటి ఆశలు..



- పెండింగ్ సమస్యలకు పరిష్కారం లభించేనా?
- రేషన్ కార్డులు, రైతుభరోసా, పూర్తిస్థాయిలో రుణమాఫీ?
- ఇందిరమ్మ ఇళ్లపై ప్రజల్లో ఆశలు

చింతలమానేపల్లి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ఉద్యోగులు, కోటిఆశలు, కొత్తలక్ష్యాలతో కొత్తసంవత్సరం-2025లోకి అడుగుపెట్టారు. 2025లోనైనా తమ సమస్యలు పరిష్కారం కాగలవన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా కొంతకాలంగా జిల్లా ప్రజలు కొత్తరేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, పూర్తిస్థాయిలో రైతాంగానికి రుణమాఫీ, వంటివి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుందన్న ఆశతో ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాదిలో పెండింగ్ సమస్యలు పరిష్కారం అవుతాయన్న ఆశాభావం ప్రజల్లో వ్యక్తం అవుతున్నది.

రేషన్‌కార్డులకు మోక్షం లభించేనా?

రేషన్‌కార్డులు లేని వారందరికీ సంక్రాంతి తర్వాత ఇస్తామని ప్రభుత్వం నమ్మకంగా చెబుతోంది. దీంతో ప్రజలు ఈ కొత్తసంవత్సరంలో తమ రేషన్‌కార్డుల పరేషాన్ తొలగిపోయినట్లేనని భావిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గత సంవత్సరం డిసెంబరు28 నుంచి జనవరి 6వరకు ప్రజాపాలన ద్వారా దరఖాస్తులు స్వీకరించింది. ప్రస్తుతం జిల్లాలో రేషన్ కార్డులకోసం 13,265మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఆ సంఖ్య రెట్టింపుగా ఉంది. ప్రస్తుతం జిల్లాలో 1,37,284కార్డులున్నాయి. ఇందుల అంత్యోదయ 12,948, తెల్ల రేషన్‌కార్డులు 1,24,336 ఉండగా వీటికి నెలనెలా రేషన్ దుకాణాల ద్వారా 2,968టన్నుల బియ్యం సరఫరా అవుతోంది. అర్హులైన వారు జిల్లాలో మరింత మంది ఉండవచ్చని అంచనా. అర్హులందరికీ ఈ ఏడాదైనా కార్డులు అందుతాయని ఎదురు చూస్తున్నారు.

నీడ దొరికేనా?

2025సంవత్సరంలో కనీసం ఇందిరమ్మ ఇళ్లైనా దక్కాలని గూడులేని జిల్లా పరిధిలోని 15 మండలాల ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో పదేళ్లుగా డబుల్‌బెడ్రూం ఇంటికోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూసి చివరకు నిరాశకు లోనయ్యారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దరఖాస్తులను స్వీకరించింది. ప్రస్తుతం లబ్ధిదారుల ఎంపికకు ఇందిరమ్మ ఇళ్లసర్వే జరుగుతోంది. సంక్రాంతి తర్వాత ఇళ్ల మంజూరు ఉంటుందని ప్రభుత్వం చెబుతోంది. దీంతో నిలువనీడ లేని నిరుపేదలు ఇందిరమ్మ ఇళ్లపై ఆశలు పెట్టుకున్నారు. ఈ ఏడాదైనా తమకు ఇల్లు ఇస్తుందన్న నమ్మకంతో ఉన్నారు.



రైతు భరోసా, రుణమాఫీపై ఆశలు..

రైతులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టా ఉన్న వాళ్లందరికీ రైతుబంధు పేరిట ఎకరాకు రూ.5వేల చొప్పున రెండు దఫాలుగా రూ.10వేలను రైతుల ఖాతాల్లో జమ చేసింది. దీంతో రైతులు సాగు పనుల కోసం, ఇతర పనుల కోసం ఆ డబ్బులను ఖర్చు చేసుకునేవారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. కాంగ్రెస్ అధికాంలోకి వచ్చిన మొదటిసారి పాత పద్ధతిలోనే రైతు భరోసా పేరిట రైతుల ఖాతాల్లో ఎకరాకు రూ.5వేలచొప్పున జమ చేశారు. వరాకాలంలో, యాసంగి సాగు డబ్బులు ఇప్పటివరకు ఇవ్వకపోవడంతో రైతాంగం నిరాశతో ఉంది. ఎకరాకు రూ.15వేలు రెండు దఫాలుగా ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. దీనిపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసి రైతు భరోసా విధివిధానాలపై చర్చించి ఎన్ని ఎకరాల మేరకు రైతులకు భరోసా అందించాలని రాష్ట్రప్రభుత్వం స్పష్టత ఇప్పటికీ ఇవ్వకపోవడంతో రైతాంగం ఈ విషయంలో ఎదురుచూస్తోంది. ఈ ఏడాదైనా రైతాంగాన్ని ఆదుకునేందుకు అడుగులు పడుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గతంలో జిల్లాలో 1.40లక్షల మంది రైతుల్లో ప్రభుత్వం 1.38లక్షల మంది రైతులకు సుమారుగా 20 కోట్లపైనే రైతుబంధు అందించింది. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం రైతులకు రుణమాఫీ విడుతల వారీగా రూ.2లక్షలలోపు ఉన్న వారందరికీ మాఫీ చేసింది. రూ.లక్షలోపు రుణాలు తీసుకున్నవారు 22వేలమంది, రూ.1.5 లక్షలలోపు రుణాలు తీసుకున్నవారు 14,623మంది ఉండగా వీరికి మూడు విడతల్లో 51,523మంది రైతుల ఖాతాల్లో రూ.465.84 కోట్లు జమయ్యాయి. నాలుగో విడత కింద 3,664మంది ఖాతాల్లో 41.30కోట్లు జమ య్యాయి. కానీ రూ. 2లక్షల పైన రుణం ఉన్న వారెవ్వరికీ మాఫీ కాలేదు. రూ.2లక్షలపైన ఉన్న రైతాంగం అంతా రూ.2లక్షల వరకు రుణం మాఫీ చేస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 20నుంచి30శాతం మంది రైతులు రుణమాఫీ కాక ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాదైనా రుణమాఫీ అవుతుందన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్డీపీవోగా చిత్తరంజన్ బాధ్యతల స్వీకరణ



ఎస్పీకి పూల మొక్కను అందజేస్తున్న ఎస్‌డీపీవో చిత్తరంజన్

ఆసిఫాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ ఎస్‌డీపీవో(సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్)గా ఎస్ చిత్తరంజన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గ్రేహౌండ్స్ ఏఎస్పీగా పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం ఇటీవల జిల్లాకు బదిలీ చేసింది. ఉద్యోగబాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన ఎస్పీ డీవీ శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

గంగాపూర్‌లో ఎస్పీ పూజలు

రెబ్బెన: రెబ్బెన మండలం గంగాపూర్‌లోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆయంలో బుధవారం ఎస్పీ శ్రీనివాస్ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో బాపిరెడ్డి, ఆలయ పూజారి ఎస్పీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రెబ్బెన సీఐ బుద్ధె స్వామి, ఎస్సై చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లై హమాలీల సమ్మె



సమ్మెలో కూర్చున్న సవిల్ సప్లయి హమాలీలు

ఆసిఫాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయిలో పనిచేస్తున్న హమాలీలు పెరిగినరేట్ల జీవోను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం నిరవధిక సమ్మెకు దిగారు. జిల్లా కేంద్రంలోని సివిల్ సప్లయి గోదాం ఆవరణలో దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, శ్రీనివాస్,తుకారాం,మోహన్,కొమురక్క,తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీమాకోరెగావ్ శౌర్య దివస్



శౌర్య దివస్ జరుపుకుంటున్న అంబేద్కర్ సంఘం నాయకులు

వాంకిడి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): బీమాకోరెగావ్ శౌర్యదివస్‌ను బుధవారం మండలంలోని వివిధగ్రామాల్లో ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ఈసందర్భంగా జేత్‌వాన్ బుద్ధవిహార్‌లో అంబేద్కర్, గౌతమ బుద్ధుడి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 1818జనవరి 1న బీమాకోరెగావ్ గ్రామంలో సమానత్వం, ఆత్మగౌరవం కోసం జరిగిన పోరాటంలో కేవలం 500 మంది మహర్ సైనికులు 28,000మంది పిస్వ సైన్యాన్ని ఓడించారని అన్నారు. ఈసంఘటనలో వీరమరణం పొందిన 22మంది భీమ్ సైనికులకు ఈసందర్భంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీఎస్‌ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్, మండల నాయకులు జైరాం ఉప్రె, దుర్గం శ్యాంరావు, విలాస్, రాజేంద్రప్రసాద్, దుర్గం ప్రశాంత్, రోషన్, ప్రతాప్, పాండుజీ, రాజేశ్వర్,అంబేద్కర్‌సంఘం నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న జిల్లా రవాణాధికారి రాంచందర్‌నాయక్

ఆసిఫాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నియమా పాటించాలని జిల్లారవాణాధికారి రాంచందర్‌నాయక్ అన్నారు. జాతీయ రోడ్డుభద్రత మహోత్సవం2025సందర్భంగా బుధవారం పట్టణంలోని సాంఘికసంక్షేమ బాలురగురుకులపాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. అజాగ్రత్తగా వాహనం నడుపకూడదన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలపై వివరించారు. విద్యార్థులు తమతమ కుటుంబ సభ్యులకు గ్రామస్థులకు రోడ్డుభద్రత నియమాలు తెలియజేయలన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ మోహన్, ఏఎం వీఐ రాజమల్లు, కానిస్టేబుళ్లు వాజీద్, రవి, ప్రిన్సిపాల్ యాదగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించాలి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

జైనూర్, జనవరి 1(ఆంధ్రజ్యోతి):ఆదివాసీలు తమ సంస్కృతీ సంప్రదాయలను పరిరక్షించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని జంగాంలో జంగో లింగో ఆదివాసీల దీక్షలో ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. అంతకుముందు ఆదివాసీల ఆరాధ్య దైవం హైమన్ డార్ఫ్ దంపతుల వర్ధంతి కరప్రతాలను విడుదల చేశారు. మండల కేంద్రంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జంగో లింగో దీక్ష నిర్వాహకులు ఘన్ సంస్థన్ సభ్యులు కుమ్ర భగవంత్ రావు,ఆత్రం రఘునాథ్, గెడం జగ్జీవన్,పుష్పరాణి జైనూర్ సహకార సంఘం చైర్మన్ కొడప హన్ను పటేల్, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరించిన ఎమ్మెల్యే..

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని ఈదులవాడ గ్రామపంచాయతీ పరిధిలోని అన్నారం గ్రామంలోని శ్రీ భీమయ్యక్ దేవుడి ఆలయ వార్షికోత్సవానికి సంబంధించిన కరపత్రాలను బుధవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి విడుదల చేశారు. ఈనెల 4,5తేదీల్లో ఆలయంలో ప్రత్యేక పూజలు, వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయ అవరణలో కబడ్డీపోటీలను నిర్వహిస్తామన్నారు. అనంతరం కెరమెరి మండలానికి చెందిన సుమన్‌బాయికి మంజూరైన రూ.12,500 చెక్కును ఎమ్మెల్యే కోవ లక్ష్మి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అలీబీన్ అహ్మద్, నిర్వహణకమిటీ సభ్యులు ఆత్రంభీంరావు, గంగారాం,తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం

పెంచికలపేట, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం ఓ గర్భిణీని 108లో ఆసుపత్రికి తరలిస్తుండగా బిడ్డకు జన్మనిచ్చింది. కొండపల్లి గ్రామానికి చెందిన ఆత్రం పార్వతికి మంగళవారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో కుటుంబసభ్యులు 108ను సంప్రదించారు. అంబులెన్స్‌లో మంచిర్యాల ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో బెల్లంపల్లి వద్ద నొప్పులు అధికమయ్యాయి. ఈఎంటీ సుధాకర్, పైలేట్ కిష్టయ్య చొరవతీసుకుని ప్రసవం చేయగా పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ ఇద్దరు ఆరోగ్యంగా ఉన్నారని అంబులెన్స్ సిబ్బంది తెలిపారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జిల్లాలో 30పోలీసు యాక్టు అమలు

ఆసిఫాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల దృష్ట్యా జిల్లావ్యాప్తంగా ప్రశాంతా వాతావరణ పరిస్థితులను మరింత నవ్యంగా కొనసాగించడానికి జనవరి1 నుంచి 31వరకు జిల్లా అంతటా 30పోలీసు యాక్టు అమలులో ఉంటుందని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 30 పోలీసు యాక్టు అమలులో ఉన్నందున ముందస్తు అనుమతులు లేకుండా ఎలాంటి ప్రజా సమావేశాలు, ఊరేగింపులు, ధర్నా, బహిరంగ సభలు తదితర ప్రజలు గుమికూడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. లౌడ్‌స్పీకర్లు, డీజేలు వంటివి నిషేధమని తెలిపారు.

ఎస్సీ కులాల ఉపవర్గీకరణపై రేపు విచారణ

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులముల ఉపవర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఏకసభ్య కమిషన్ ప్రతినిధి, రాష్ట్రహైకోర్టు మాజీ న్యాయాధికారి డాక్టర్ షమీమ్‌అక్తర్ ఆధ్వర్యంలో ఈనెల3న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లాకార్యాలయ భవన సమావేశ మందిరంలో బహిరంగవిచారణ నిర్వహిస్తామని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడిఆదిలాబాద్ జిల్లా(ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కుమరం భీం ఆసిఫాబాద్) ప్రజల అభిప్రాయాలను విచారణలో స్వీకరిస్తామన్నారు. ఎస్సీ కులాల సంఘాల ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై అభిప్రాయాలు, వినతులు సమర్పించాలన్నారు.

సిబ్బంది నూతనోత్తేజంతో పనిచేయాలి

- జిల్లా అటవీఅధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరంలో అటవీసంరక్షణలో సిబ్బంది నూతనోత్తేజంతో పనిచేయాలని జిల్లా అటవీఅధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్ అన్నారు. బుధవారం అటవీశాఖ సిబ్బంది అసోసియేషన్ క్యాలెండర్, డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబ్బంది సమస్యలు తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో రేంజ్ అధికారులు గోపిచంద్ సర్దార్, శ్రీనివాస్, నిజాముద్దీన్, మజారుద్దీన్, జ్ఞానేశ్వర్, యోగేష్, సద్దాం, అనీల్, స్వప్న, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న కలెక్టర్, కుటుంబ సభ్యులు



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అదనపు కలెక్టర్ శ్రద్ధశుక్లా

ఆసిఫాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంతోపాటు మండలంలో 2025 నూతనసంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటల తరువాత కొత్తసంవత్సరానికి స్వాగతం పలుకుతూ అన్నివర్గాల ప్రజలు ఆనందోత్సాహాల మధ్యవేడుకలను నిర్వహించారు. బుధవారం నూతన సంవత్సరం సందర్భంగా ఆయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. కలెక్టర్ వెంకటేష్ దోత్రే కుటుంబ సభ్యులతో కలిసి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలెక్టర్‌ను కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధశుక్లా మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. సింగరేణి బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పట్టణంలో యువకులు డ్యాన్సులు చేశారు. కేక్‌కట్ చేసి సంబరాలు జరిపారు. పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ రామానుజం ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోస్తు నిర్వహించారు.

వాంకిడి/కెరమెరి/బెజ్జూరు/చింతలమానేపల్లి/సిర్పూర్(టి)/దహెగాం/కౌటాల: మండలాల్లో మంగళవారం అర్ధరాత్రి 12గంటలు దాటాక యువకులు కేక్‌లు కట్‌చేసి టపాసులు పేల్చి నూతనసంవత్సర సంబరాలు జరుపుకున్నారు.

బంధువులు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళలు బుధవారం ఇళ్లముందు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ముగ్గులు వేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అటవీకేసుల పరిష్కారానికి సరైన విధానం పాటించాలి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి ఎంవీ రమేష్

సిర్పూరు(టి), జనవరి 1 (ఆంధ్రజ్యోతి): అటవీ కేసుల పరిష్కారం కోసం సిబ్బంది నిర్ణీత విధానాన్ని పాటించాలని జిల్లా జడ్జి ఎంవీ రమేష్ అన్నారు. కాగజ్‌నగర్‌లోని వేంపల్లి టింబర్ డిపో అవరణలో సిబ్బందితో అటవీకేసుల పరిష్కారానికి జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్ అధ్యక్షతన నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అడవి జంతువులను వేటాడం నేరమన్నారు. ఇటువంటి కేసుల సత్వర పరిష్కారం కోసం సిబ్బంది అవసరమైన సాక్ష్యాలను త్వరగా ప్రవేశపెట్టాలన్నారు. సమావేశంలో సినియర్ సివిల్ జడ్జి యువరాజు, జూనియర్ సివిల్‌జడ్జి అనంత లక్ష్మి, ఎఫ్‌డీవో, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

- తల్లిదండ్రుల ఆగ్రహం
- ఉపాధ్యాయులపై దాడిచేసిన కుటుంబసభ్యులు



విద్యార్థి శ్రీధర్‌తో మాట్లాడుతున్న తండ్రి

కాగజ్‌నగర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలలో బుధవారం ఉదయం పదోతరగతి విద్యార్థి శ్రీధర్ (15)ను ఉపాధ్యాయుడు రవిశంకర్ యాదవ్ చితకబాదాడు. ఈ సంఘటనలో శ్రీధర్‌కు మర్మాంగం వాపు రావటంతో హుటాహుటిన కాగజ్‌నగర్ ప్రయివేటు ఆసుపత్రికి తరలించి తిరిగి పాఠశాలకు తరలించారు. సంబంధిత విద్యార్థి తల్లిదండ్రులకు పాఠశాల సిబ్బంది సమాచారం అందించటంతో తండ్రి లాలయ్యతోపాటు కుటుంబసభ్యులు పాఠశాలకు చేరుకుని పరిస్థితి వాకాబు చేశారు. శ్రీధర్ జరిగిన సంఘటనను తల్లిదండ్రుకు వివరించాడు. ఆగ్రహించిన కుటుంబ సభ్యులు రవిశంకర్‌తోపాటు ఇతర ఉపాధ్యాయులను చితకబాదారు. పరిస్థితి విషమించటంతో ప్రిన్సిపాల్ వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సందీప్ సంఘటన స్థలానికిచేరుకొని పరిస్థితిని పర్యవేక్షించారు. బీఆర్ఎస్ నాయకులు నక్క మనోహర్, నరేందర్ తదితరులు పాఠశాలను సందర్శించి బాధ్యులైన ఉపాధ్యాయులపై వెంటనేచర్యలు చేపట్టాలని డిమాండు చేశారు. ఈవిషయమైప్రిన్సిపాల్ కనికవర్మను సంప్రదించగా, తమ పాఠశాలలో ఎలాంటి సంఘటన జరుగలేదని చెప్పుకొచ్చారు.

నేడు గిరిజనశాఖ నాల్గోతరగతి ఉద్యోగుల సమావేశం

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ గిరిజనశాఖలో పనిచేస్తున్న 4వతరగతి ఉద్యోగుల సమావేశం ఆసిఫాబాద్ జిల్లాకేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు రాంచందర్, పోచం, చిరంజీవి, రవి ఒకప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు.

ఆలయంలో భక్తుల పూజలు

కౌటాల, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని చప్రాడ ప్రశాంతధామ్ కార్తీక్‌మహారాజ్ ఆలయంలో బుధవారం భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. మంచిర్యాల, లక్సెట్టిపేట, వరంగల్, కన్నెపల్లి, వేమనపల్లి గ్రామాలనుంచి 400మందిభక్తులు పాదయాత్రగా చప్రాడకు చేరుకుని కార్తీక్‌మహారాజ్ పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం అన్నప్రసాదాన్ని అందజేశారు. మండలకేంద్రంలోని శివాలయంలో నూతన సంవత్సరం సందర్భంగా భక్తులు బారులు తీరారు.

నేడు ధాన్యం కొనుగోళ్లకు ఆఖరి రోజు

పెంచికలపేట, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహిస్తున్న మూడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఈ నెల2 సాయంత్రం నుంచి మూసివేస్తున్నట్లు కార్యదర్శి సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో నేటి వరకు 24679బస్తాలు 987160క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. గురువారం సాయంత్రం 5గంటల వరకు రైతుల వద్ద ధాన్యం ఉన్నట్లయితే కొనుగోలు కేంద్రాలకు తీసుకు రావాలన్నారు.

పీఆర్టీయూ డైరీ, క్యాలెండర్ అవిష్కరణ

ఆసిఫాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ 2025 డైరీ, క్యాలెండర్‌ను బుధవారం కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎమ్మెల్యే కోవలక్ష్మి వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో విద్యాప్రమాణాల పెరుగుదలకు ఉత్తమఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లాఅధ్యక్షుడు శ్రీనివాస్ రావు, నాయకులు అనిల్‌కుమార్, ఉదయ్ బాబు, వెంకటేశ్వర్లు, రాజు, వరలక్ష్మి, అరుంధతి తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

టీఎస్‌యూటీఫ్ క్యాలెండర్..

టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్, డైరీని బుధవారం కలెక్టర్ వెంకటేష్ దోత్రే చేతుల మీదుగా ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఊశన్న, నాయకులు ఇందురావు, హేమంత్, సమ్మయ్య, సుభాష్, మీనాకుమారి, అనిత, అన్నపూర్ణ పాల్గొన్నారు.



డైరీని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే..

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ సర్‌సిల్క్ ఏరియాలో బుధవారం ఎమ్మెల్యే హరీష్ బాబు టీఎస్‌యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్యశాంతికుమారి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే హరీష్ బాబు



జంగుబాయి క్షేత్ర గుహలు



ఆదివాసీల ఆరాధ్య దైవం జంగుబాయి

- ప్రారంభమైన జాతర
- నేటి నుంచి నెలరోజుల పాటు ఉత్సవాలు

దీపమే.. జంగుబాయి రూపం

కెరమెరి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జంగుబాయి జాతరకు అంతా సిద్ధమైంది. జంగుబాయి ఆదివాసీల ఆరాధ్యదైవం. మండలంలోని కోటా పరందోళి బీడ్ వార్ సమీపంలో తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో అడవి ప్రాంతంలో ఈ జంగుబాయి పుణ్యక్షేత్రం ఉంది.

● నియమ నిబంధనలు..

పుష్యమాసంలో నెలవంక కనిపించిన రోజు నుంచి పుష్య అమవాస్య వరకు ఆదివాసులు పవిత్రమాసంగా భావిస్తుంటారు. తమ ఇల్లు, వాకిలి అంతా శుభ్రం చేసి ఆవు పేడతో అలుకు చల్లి పవిత్రంగా ఉంచుకుంటారు. నెల రోజుల పాటు ఆదివాసులు తప్ప ఇతర ఎవరిళ్లలోనూ కనీసం మంచి నీళ్లు కూడా తాగరు. నెలరోజుల వరకు పాదరక్షలు ధరించరు. ఇంటి ఆవరణలో కూడా అవిలేకుండా చూసుకుంటారు. మద్యానికి దూరంగా ఉంటారు. జంగుబాయిని కొలిచే భక్తులు బయట భోజనాలు చేయరు. హోటళ్లలో భోజనం, తాగునీరు కూడా ముట్టరు. ఇంటివంటకే పరిమితం అవుతారు. జంగుబాయి వద్దకు వచ్చే భక్తులు చాలామంది కాలినడకనే వస్తుంటారు. దూరప్రాంతాల వారు వాహ నాల్లో వస్తుంటారు. ఈ జంగుబాయి పుణ్య క్షేత్రంలో ముందుగా ఎనిమిది గోత్రాల వారు కటోడాలు ప్రకటించిన రోజున నియమనిష్టలతో జంగుబాయి సన్నిధికి వెళ్లి రాత్రిపూట దీపారాధన నిర్వహించి ప్రత్యేక నైవేద్యం సమర్పిస్తారు. అప్పటినుంచి వారు అక్కడే ఉంటూ నిత్యం హాజరయ్యే భక్తుల కు ముందుండి సంప్ర దాయ పూజలు చేయిస్తారు.

● జంగుబాయి దర్శనం..

జంగుబాయి పుణ్యక్షేత్రానికి వచ్చేవారు ముందుగా ఈ టోప్లకాస వద్ద నదిలో తమ ఇంటిదేవతలకు పూజలు చేసి స్నానాలు చేయించి నలుమూలల దండం పెట్టి మొక్కుతారు. డోలు వాయిద్యాల నడుమ పూజలు చేసి పునకాలతో బయలు దేరు తారు. టోప్లకాస నుంచి రావుడ్‌పేన్‌ను దరిం చుకుంటారు. అక్కడ నైవేద్యాలను పెట్టి మొక్కులు చెల్లించి అవ్వల్‌పేన్ ఆలయంలో పూజలు చేస్తారు. ఈ మూడుస్థలాల్లో పూజలు పూర్తయ్యాకే జంగుబాయిని దర్శించుకుంటారు. అవ్వల్ పేన్ పూజ దర్శనం తరువాత అక్కడ నుంచి జంగుబాయి మహల్ వద్దకు చేరుకొని రాయితాడ్‌పేన్‌కు పూజలు చేసి జంగుబాయి గుహపైకి ఎక్కుతారు. గుహలోపల జంగుబాయి దీపాన్ని దర్శించు కుంటారు. జంగుబాయి పూజల అనంతరం అందరు కలిసి తమ తమ కుటుంబాలతో సందడిగా వివిధ రకాల వంటకాలు తయారు చేస్తారు. ముందుగా తమ దేవతలకు నైవేద్యం పెట్టి ఆ తరువాత అందరూ కలిసి విందు ఆరగిస్తారు. స్వచ్ఛమైన నువ్వుల నూనె, ఇప్పనూనెతో నైవేద్యం పెట్టాక మహిళలు వంటలు, గారెలు, బూరెలు చేస్తారు.



జంగుబాయి క్షేత్రానికి వస్తున్న భక్తులు

● జంగుబాయి దీక్షలు..

పుష్యమాసంలో జంగుబాయి దీక్షను నెల రోజుల పాటు చేస్తారు. జంగుబాయి దీక్షల్లో పురుషులు (పసుపు రంగు) స్త్రీలు (తెల్లని వస్త్రాలు) దుస్తులు ధరించి నెలరోజులు నియమనిష్ఠలతో ఉంటారు.

● చరిత్ర

పుష్యమాసంలో నెలరోజులపాటు ఆదివాసీలు నియమ నిష్టలతో ఉంటూ జంగుబాయిని దర్శించుకుంటారు. జంగు బాయి ఒక వెలుగు. చీకట్లను పారద్రోలే దీపాన్ని జంగుబాయి, దేవత రూపంగా ఆదివాసులు ఆరాధిస్తారు. దట్టమైన అడవిలో నది పక్కన ఎత్తైన కొండమధ్యలోని గుహలోపల కాంతులు వెదజల్లే దీపమే జంగుబాయి దేవత. ఆ దీపం ఉంచిన స్థలమే జంగుబాయి మహల్.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



శ్రీనివాస్(ఫైల్)

మంచిర్యాల క్రైం, జనవరి 1(ఆంధ్రజ్యోతి) మంచిర్యాల పట్టణం సంజీవయ్య కాలనికి చెందిన మహంకాలి శ్రీనివాస్(50) అనే కూలీ బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మంచిర్యాల ఎస్‌హెచ్‌వో ప్రమోద్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ ఐబీ చౌరస్తాలో రోడ్డు దాటుతుండగా శ్రీరాంపూర్ నుంచి ట్రాలీ అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. కింద పడిన శ్రీనివాస్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శ్రీనివాస్. భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

తిర్యాణి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇర్కపల్లి గ్రామానికి చెందిన కుడ్మెత మారుతి(35) గతనెల 28న అప్పులబాధతో పురుగుల మందు తాగి మంచిర్యాల ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నాడు. బుధవారం పరిస్థితి విషమించడంతో మారుతి మృతిచెంది నట్లు ఎస్సై మాధవ్‌గౌడ్ తెలిపారు. మృతుడి భార్య వనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అడవి కుక్కల దాడిలో 55 మేకలు మృతి



దాడిలో మృతిచెందిన మేకలు

కోటపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కలపల్లి పంచాయతీ బ్రహ్మణ పల్లి గ్రామ అటవీ ప్రాంతంలో బుధవారం అడవి(రేస్) కుక్కల దాడిలో ముల్కల్ల వెంకట్ అనే రైతుకు చెందిన 55 మేకలు మృతిచెందాయి. అటవీ ప్రాంతానికి మేతకని మేకల మంద వెళ్లగా హఠాత్తుగా సుమారు 30 అడవి కుక్కలు హఠాత్తుగా మేకల మందపై పడ్డాయని, దీంతో మేకలు చెల్లా చెదురాయ్యయని బాధితుడు వెంకట్ వాపోయాడు. పరిగెడుతున్న మేకలపై అడవి కుక్కలు దాడి చేసి చంపాయన్నారు. మొత్తంగా 55 మేకలు మృతిచెందగా రూ. 5 లక్షల నష్టం వాటిల్లిందని చెప్పాడు. సుమారు 140 మేకల మందపై అడవి కుక్కలు దాడి చేయడంతో 55 మృతిచెందగా మరో 30 మేకల జాడ కానరావడం లేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. అటవీ అధికారులు తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబీకులు విజ్ఞప్తి చేశారు.

కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు బుధవారం జీఎం ఎల్‌వి సూర్యనారాయణను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మొక్కను బహూకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ, కార్మికుల పెండింగ్ సమస్యల కోసం యాజమాన్యం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జీఎం చర్చల ప్రతినిధులు బద్రి బుచ్చయ్య, ప్రసాద్ రెడ్డి, ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా పాల్గొన్నారు.

పెద్దవాగులో మెడికల్ వ్యర్థాలు



పెద్దవాగునీటిలో తేలియాడుతున్న సిరంజ్‌లు, ఇతర వ్యర్థాలు

పెంచికలపేట, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దవాగు జలాలు కలుషితమవుతున్నాయి. కొన్ని వేల జాలర్ల కుటుంబాలు ఈ పెద్దవాగులో చేపలు పడుతూ జీవనం సాగిస్తుంటాయి. అలాంటి పెద్దవాగు జలాల్లో కొంత మంది వ్యక్తులు వాడేసిన సిరంజీలు, సూదులు, కాటన్ బ్యాండేజ్, గ్లూకోజ్ బాటిళ్లు, ప్లాస్టిక్ డబ్బాలు, కవర్లు తదితర వైద్య సంబంధిత వ్యర్థాలను పెద్దవాగులో వేస్తున్నారు. సంబంధిత శాఖాధికారులు దృష్టిసారించి పెద్దవాగు కాలుష్యాన్ని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పదిహేను రోజులుగా తెరుచుకోని చెక్ పోస్టు



మూసి ఉన్న మార్కెటింగ్ శాఖ చెక్ పోస్టు

సిర్పూర్(టి), జనవరి 1(ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండలంలో హుడ్కిలి- మహారాష్ట్ర సరిహద్దుల్లో ఏర్పాటుచేసి కాగజ్‌నగర్ మార్కెటింగ్ శాఖ ద్వారా నిర్వహిస్తున్న మార్కెటింగ్ శాఖ చెక్ పోస్టు పదిహేను రోజులుగా తెర్చుకోవడం లేదు. ప్రతి నిత్యం తెలంగాణ ప్రాంతం నుంచి మహారాష్ట్ర పత్తి లోడ్ తీసుకు వెళ్లే వాహనాలతో టాక్స్ రూపంలో ఆదాయం సమకూరుతుంది. పదిహేను రోజులుగా చెక్ పోస్టు తెర్చుకోక పోవడంతో ప్రభుత్వానికి ఆదాయం గండి పడుతోంది ఈ విషయమై మార్కెట్ కమిటీ కార్యదర్శి ఓదెలును వివరణ కోరగా చెక్ పోస్టు పది హేను రోజులుగా మూసి ఉన్న మాట వాస్తవమేనని ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు పోయామని తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సివిల్ సప్లయిస్ హమాలీ కార్మికుల సమ్మె

సుల్తానాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలంటూ పౌర సరఫరాల సంస్థ గోదాముల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికులు ఆందోళనకు దిగారు. సుల్తానాబాద్ పట్టణంలోని మార్కెట్ యార్డులోగల గోదాము వద్ద హమాలీలు బుధవారం సమ్మె చేశారు. ప్రభుత్వం పెంచిన కూలీ రేట్లకు జీవో విడుదల చేసే వరకు సమ్మె చేస్తామని తెలిపారు.

ఎలుగుబంటి దాడిలో ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎలుగుబంటి దాడి చేసిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం గుంటపల్లి చెరువు తండాకు చెందిన మేకల కాపరి భూక్య నరేష్ బుధవారం తీవ్ర గాయాల పాలయ్యాడు. తండాకు చెందిన నరేష్ తన గొర్రెలు, మేకలను తీసుకుని మేత కోసం శివారులోని అటవీ ప్రాంతానికి వెళ్లాడు.. తిరిగి వస్తున్న క్రమంలో చెట్ల పొదల్లో నుంచి ఒక్కసారిగా ఎలుగుబంటి దాడికి దిగింది. అప్రమత్తమైన నరేష్ చేతిని అడ్డుపెట్టి మరో చేతిలో ఉన్న గొడ్డలితో ఎలుగుబంటిపై ఎదురు తిరిగాడు. దీంతో ఎలుగుబంటి పారిపోయింది. చుట్టుపక్కల వారు ఆస్పత్రికి తరలించారు.

పులి పట్టివేత



బోనులో పులి

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూరు, మహారాష్ట్ర సరిహద్దున తిరుగుతున్న మ్యాన్ ఈటర్ పులిని ఎట్టకేలకు మహారాష్ట్ర ఫారెస్టు అధికారులు వ్యూహాత్మకంగా బుధవారం పట్టుకున్నారు. మహారాష్ట్ర మ్యాన్ ఈటర్‌గా పేరొందిన ఈ పులితో ప్రజలంతా ఇన్ని రోజులు వణికిపోయారు. బుధవారం ఈ పులిని పట్టుకొని బోనులో బందించారు. దీంతో పరిసర ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పులిని పట్టుకున్న వారిలో అటవీశాఖ అధికారులు శ్వేతా, పవన్‌కుమార్, ప్రకాష్‌జాడే, సిబ్బంది ఉన్నారు. అటవీ శాఖ అధికారులు చేపట్టిన ఈ టాస్క్‌పై ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పులి ఇద్దరిని చంపేసింది.

ఎమ్మార్పీఎస్ వారోత్సవాలు

కౌటాల, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలోడి గ్రామంలో బుధవారం ఎమ్మార్పీఎస్ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్‌కమిటీ చైర్మన్ సిద్దలదేవయ్య జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు శైలజగౌడ్, నక్క శంకర్, తిరుపతి, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ ఆఫీసర్‌కు సన్మానం

వాంకిడి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): వాంకిడి సహకార బ్యాంకులో ఫీల్డ్‌ఆఫీసర్‌గా సేవలందించి బదిలీపై సిర్పూర్(టి)కి వెళ్తున్న శ్రీరామ్ హరిబాబును బుధవారం వాంకిడిపీఏసీఎస్‌లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పెంటయ్య, బ్రాంచిమేనేజర్ జ్యోతి, కార్యదర్శి ఓమాజీ, సిబ్బంది శ్రారామ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న భక్తులు

బెజ్జూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం లోని రంగనాయక ఆలయ ప్రాంగణంలో మంగళవారం రాత్రి అయ్యప్ప పడిపూజ అంగరంగ వైభవంగా జరిగింది. కాగజ్‌నగర్‌పట్టణానికి చెందిన గురుస్వామి ఎనగందుల భిక్షపతి ఆధ్వర్యంలో బెజ్జూరుకు చెందిన జిల్లాల సుధాకర్ గౌడ్‌చే పడిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బెజ్జూరు, చింతలమానేపల్లి, కౌటాల మండలాలతోపాటు మహారాష్ట్రకు చెందిన పలువురు అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు. ఈసందర్భంగా అయ్యప్ప నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. అయ్యప్పస్వామిని పల్లకీలో కూర్చోబెట్టి నృత్యాలు చేస్తూ ఆలయాల చుట్టూ ప్రదక్షణ చేశారు. అనంతరం రాత్రి 12గంటల ప్రాంతంలో అయ్యప్ప స్వాములు అగ్నిగుండాల ప్రవేశం చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ మేళా

కాగజ్‌నగర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కృష్ణవేణి పాఠశాలలో బుధవారం ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు చిత్రలేఖనాలను వ్యర్థాలతో దైనందిన జీవితంలో ఉపయోగపడే వివిధ వస్తువును ప్రదర్శించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ దోమల సురవర్దన్, డైరెక్టర్ జియా ఉల్ హక్, వేద ప్రవీణ్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన దీక్ష బుధవారం నాటికి 23వరోజుకు చేరుకుంది. దీక్షలకు పీఆర్టీయూ అధ్యక్షకార్యదర్శులు శ్రీనివాస్, అనీల్, ఉదయ్‌బాబు, భరత్, శ్రావణ్, భక్షపతి మద్దతు తెలిపారు. దీక్షల్లో ఎస్ఎస్ఏ ఉద్యోగులు నాగేష్, సందీప్, అనూప్, అరుణ,మీనా, నాగసుధ, స్వప్న, అన్నపూర్ణ, చైతన్యమోహన్,భూమన్నపాల్గొన్నారు.



దీక్షలో కూర్చున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు



రికార్డులు తిరగరాసిన శ్రీరాంపూర్ ఏరియా : జీఎం



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం

శ్రీరాంపూర్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్‌ఏరియా డిసెంబర్‌లో రికార్డులు తిరగరాసిందని జీఎం ఎల్ వి సూర్యనారాయణ అన్నారు. జీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అండర్‌గ్రౌండ్ గనుల్లో 90శాతం, ఉపరితల గనుల్లో 121శాతం ఓవరాల్‌గా 114శాతంఉత్పత్తిని సాధించామన్నారు. రక్షణ పక్షోత్సవాలు, మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశాల ద్వారా ఉత్పత్తి మెరుగైందన్నారు. సంవత్సరంలో 383ఎస్ఎల్‌పీ పదోన్నతులివ్వగా, బుధవారం ఒక్కరోజే 240 ఎస్ఎల్‌పీ పత్రాలు అందించామన్నారు.

రికార్డుల మోత..

గతనెల 27న 28,509 మెట్రిక్‌టన్నుల బొగ్గును, 30న అండర్ గ్రౌండ్ గనుల్లో 5,578 మెట్రిక్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేశామన్నారు. డిసెంబర్‌లో 5.78లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంకాగా, 6.56లక్షల టన్నుల బొగ్గును వెలికితీసినట్లు చెప్పారు. 27న ఒక్కరోజే 29,215 టన్నులు 7రేకులబొగ్గును, నెల మొత్తంలో 157రేకుల బొగ్గును రవాణా చేశామన్నారు. గతనెల31న 1.41క్యూబిక్ మీటర్ల ఓబీని తొలగించినట్లు వివరించారు. ఆయా రికార్డుల సాధనకు ఉద్యోగులు, అధికారులు, యూనియన్ నాయకులు తమ పూర్తిస్థాయి సహకారం అందించారని, వారికి కృతజ్ఞతలు తెలియజేస్తు న్నామన్నారు. అలాగే సింగరేణి ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో ఎస్ వోటుజీఎం ఎన్ సత్యనారాయణ, డీజీఎం (పర్సనల్) అరవిందరావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, సీనియర్ పీవోకాంతారావు పాల్గొన్నారు.

లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలి

శ్రీరాంపూర్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలని ఆర్కే6గని మేనేజర్ ఈ తిరుపతి అన్నారు. ఉద్యోగవిరమణ పొందిన కార్మికులను బుధవారం గనిఆవరణలో సన్మానించారు. ఈ సందర్భంగా మేనేజర్ తిరుపతి మాట్లాడుతూ, రిటైర్‌అవుతున్న కార్మికులను ఆదర్శంగా తీసుకొని ప్రస్తుతంఉన్న కార్మికులు ముందుకు వెళ్లాలని సూచించారు. ఆర్కే6గని ఉత్తమఎస్‌డీఎల్ నిర్వహణగనిగా ఎంపిక కావడం, కొత్తగూడెంలో బహుమతి పొందడం ఆనందదాయకమన్నారు. ఈ సందర్భంగా 34మంది కార్మికులకు సర్వీస్ లింక్‌డ్ (ఎస్ఎల్‌పీ) పదోన్నతిపత్రాలు అందించారు. అనంతరం మైసమ్మతల్లి ఆలయంలో పూజలు నిర్వహించగా, మేనేజర్ దంపతులు హాజరయ్యారు. ఆయా కార్యక్రమాలలో రక్షణాధికారి కాదాసి శ్రీనివాస్, సంక్షేమాధికారి సురేందర్, పిట్ కార్యదర్శి సంఘం సదానందం, తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్పత్తిని చేరుకోవాలి

శ్రీరాంపూర్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు వందశాతం ఉత్పత్తిని సాధించాలని ఆర్కే7 గని మేనేజర్ తిరుపతి అన్నారు. నవంబర్‌లో అధిక ఉత్పత్తి సాధించిన సందర్భంగా పలువురు ఉద్యోగులను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉపప్రధానకార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, రక్షణాధికారి సంతోష్ రావు, సంక్షేమాధికారి సంతన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాల సాధనకు కృషిచేయాలి

రెబ్బెన, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఉత్పత్తి, ఉత్పాతకత లక్ష్యాల సాధనకు అంతా కృషి చేయాలని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. బుధవారం అన్ని విభాగాల అధిపతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన సంవత్సరంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. యంత్రాల వినియోగం, లక్ష్యసాధనకు అన్ని విభాగాల మధ్య సమన్వయం ఉండేలా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం రాజమల్లు, కైరిగూడ పీవో నరేందర్, డీజీఎంసెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, డీజీఎం(ఐఇ) బెహర పర్సనల్ మేనేజర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధనే ఐఎన్‌టీయూసీ లక్ష్యం

మందమర్రిటౌన్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల సాధనే లక్ష్యంగా ఐఎన్‌టీయూసీ పనిచేస్తుందని యూనియన్ కేంద్రకమిటీచీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాంశెట్టి నరేందర్ తెలిపారు. బుధవారం ఏరియాలోని కేకే5గనిపై కార్మికులను సమస్యలు అడిగితెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు ఇన్‌కంట్యాక్స్ రద్దు, సొంతింటి కల నెరవేర్చాలని త్వరలోనే పోరాటాలకు శ్రీకారం చుట్టబోతున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సదయ్య, రాజేంద్ర ప్రసాద్, కృష్ణమోహన్, సంపత్, స్వామి, రమేష్, వెంకటస్వామి పాల్గొన్నారు.

ప్రమోషన్‌లతో వేతన పెరుగుదల

మందమర్రిటౌన్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రమోషన్‌ల ద్వారా ఉద్యోగులకు వేతన పెరుగుదల ఉంటుందని కేకే5 గని ఇన్‌చార్జీ మేనేజర్‌రమేష్ తెలిపారు. బుధవారం గనిపై ఉద్యోగులకు ప్రమోషన్ పత్రాలనుఅందజేసి మాట్లాడారు. ప్రతిఒక్కరు రక్షణతోకూడిన ఉత్పత్తే లక్ష్యంగా పనిచేయాలన్నారు. దాదాపు 22 మందికి సర్వీసులింకుడ్ ప్రమోషన్‌పత్రాలను అందించారు. ఏఐటీయూసీ మందమర్రిబ్రాంచ్ కార్యదర్శి సలేంద్రసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులతో బాధ్యత పెంపు

శ్రీరాంపూర్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పదోన్నతులతో బాధ్యత పెరుగుతుందని ఎస్ఆర్పీ1 మేనేజర్ విజయ్‌కుమార్ అన్నారు. సర్వీస్‌లింక్‌డ్ ప్రమోషన్స్(ఎస్ఎల్‌పీ) పత్రాలను 13మంది ఉద్యోగులకు బుధవారం అందించారు. అనంతరం మాట్లాడుతూ, పదోన్నతులు బాధ్యతల్లో నూతనోత్తేజం కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో రక్షణాధికారి రాజేశ్ కుమార్, సంక్షేమాధికారి సాధన్, పిట్ కార్యదర్శి దాడి రాజయ్య పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలి

కాసిపేట, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కార్మికులందరు రక్షణతోకూడిన బొగ్గుఉత్పత్తి సాధించాలని మందమర్రి జీఎం దేవేందర్ అన్నారు. బుధవారం కాసిపేట1,2గనుల్లో ఆయన పర్యటించారు. జీఎం మాట్లాడుతూ ఉద్యోగులందరూ రక్షణ సూత్రాలు పాటిస్తూ బొగ్గు ఉత్పత్తిలో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం పదోన్నతి పొందిన కార్మికులకు సర్వీసు లింక్‌డ్ పత్రాలను అందజేశారు. అనంతరం నూతన సంవత్సరం సందర్భంగా కార్మికులతో కలిసి కేక్ కట్‌చేశారు.

ఇన్‌కంట్యాక్స్ రద్దు చేయాలి

మందమర్రిటౌన్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కార్మికుల సొంతింటి కలను వెంటనే అమలు చేయాలని, పెర్క్స్‌పై ఇన్‌కంట్యాక్స్‌ను సంస్థ రద్దు చేయాలని సీఐటీయూ బ్రాంచ్‌కార్యదర్శి వెంకటస్వామి, అల్లి రాజేందర్ పేర్కొన్నారు. బుధవారం మందమర్రిలో విలేకరులతో మాట్లాడుతూ ఈ రెండు డిమాండ్లపై మూడు వారాలుగా సింగరేణి వ్యాప్తంగా సంతకాల సేకరణ చేపట్టామని, దీనికి కార్మికుల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. వెంటనే ఈ సమస్యలను సింగరేణి సంస్థ పరిష్కరించాలన్నారు.

సెల్లార్లపై చూపు

- 5వ పేజీ తరువాయి

ఆర్‌పీ రోడ్, మున్సిపల్ ఆఫీస్ వెనుకవైపు రోడ్లను ఆక్రమించి వెలిసిన అక్రమ నిర్మాణాలను కూల్చి వేస్తున్నారు. అధికారులు తొలగిస్తున్న వాటిలో చిరు వ్యాపారులు మొదలుకొని బడా బాబులకు చెందిన పెద్ద పెద్ద భవనాలు ఉండడం గమనార్హం. అర్చన టెక్స్ చౌరస్తా నుంచి మొదలుకొని పోలీస్ స్టేషన్ చౌరస్తా వరకు అక్రమ కట్టడాలను తొలగించాలని ముందస్తుగా నోటీసులు జారీ చేశారు. దీంతో ఆయా నిర్మాణాలను యజమానులు స్వచ్ఛందంగా తొలగిస్తున్నారు. మరికొన్ని చోట్ల అధికారులే కూల్చివేయిస్తున్నారు. గతంలో రోడ్డు ఆక్రమణలను తొలగించాలని ప్రయత్నించినా...ఆ తరువాత రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అక్రమ కట్టడాల తొలగింపు ప్రక్రియ ముందుకు సాగలేదు. ఫలితంగా రోడ్డు ఆక్రమణలు మరింతగా విస్తరించాయి. ప్రస్తుతం అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తొలగనున్నాయని భావిస్తున్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక



ఎంపికైన ఆదిలాబాద్ ఉమ్మడి క్రికెట్ జట్టు

గర్మిళ్ల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్శిటీ పరిధిలో నిర్వహించే ఇంటర్ కాలేజీ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌కు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మెన్స్ క్రికెట్ జట్టును ఎంపిక చేశారు. మంచిర్యాలలోని బాలుర పాఠశాల మైదానంలో బుధవారం నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటిన వారిని ఎంపిక చేసినట్లు పీఈటీలు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్‌కు టీంకు సిద్ధార్థ, పూర్లేష్, సమీ, వికాస్, వంశీ, హరీష్, హర్షవర్ధన్, కృష్ణ, వినయ్, సుధీర్, సాయికృష్ణ, హాజెర్, రోహిత్, సాయిచరణ్, ప్రవీణ్, నితిన్ ఎంపికయ్యారు. వీరు ఈ నెల 3, 4, 5 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించే టోర్నమెంట్‌లో పాల్గొంటారని పీఈటీలు నూనె శ్రీనివాస్, కె శ్రీనివాసు తదితరులు తెలిపారు.

పోలీసుల ముమ్మర తనిఖీలు

- జిల్లా వ్యాప్తంగా 46 మందిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసులు



డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీ చేస్తున్న పోలీసులు

మంచిర్యాల క్రైం, జనవరి 1(ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజ లు శాంతి యుతంగా న్యూ ఇయర్ వేడుకలను జరుపుకో వాలన్నారు. సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలి పారు. శాంతి భద్రతల పరరక్షణకే పోలీసులు పాటుపడు తున్నారని చెప్పారు. రోడ్లపై సంచరిస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగించకూడదనే అన్ని చోట్ల తనిఖీలు చేపట్టామని తెలిపారు. జిల్లా కేంద్రంలో 46 మందిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. మంచిర్యాల పట్టణంలో 22 కేసులు నమోదయ్యాయి. తనిఖీల్లో మంచిర్యాల డీసీపీ భాస్కర్, అడ్మిన్ అడిషనల్ డీసీపీ రాజు, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, ఎస్‌హెచ్‌వో ప్రమోద్‌రావు, సీఐలు నరేష్, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

వెదురు సాగుతో లాభాల పంట

- ఒకసారి నాటితే ఏళ్ల తరబడి రాబడి
- చీడ పీడలు, తెగుళ్ల బెడద తక్కువే
- ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరింత ప్రయోజనం



వెదురుతో తయారు చేసిన వివిధ వస్తువులు

రైతు రఘు సాగు చేసిన వెదురు

బెల్లంపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ పంటలతో పాటు లాభాసాటిగా ఉండే వాణిజ్య పంటల సాగు ఇటీవల కాలంలో బాగా పెరిగింది. స్వల్ప పెట్టుబడితో దీర్ఘకాలిక పంటగా నిలిచే వెదురు సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన రైతు దాసరి రఘు. పదేళ్లుగా వ్యవసాయం చేస్తున్నాడు. ఇతర పంటలు వేస్తే అతివృష్టి, అనావృష్టి వల్ల దిగుబడులు అంతంత మాత్రంగా వచ్చాయి. దీంతో నీటి అవ సరాలు, ఎరువులు, పురుగుల మందులు, కూలీలు అంతగా అవసరం లేదని తెలుసుకుని వెదురు పంటపై దృష్టి సారించాడు. తక్కువ పెట్టుబడి అధిక దిగుబడులు అందించే దీర్ఘకాల వెదురు పంట సాగు కోసం మహారాష్ట్రకు వెళ్లి వెదురు మొక్కలను తీసుకు వచ్చాడు. ఎకరానికి 400 మొక్కలు నాటాడు. రెండేళ్లుగా పది ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో వివిధ రకాల వెదురు మొక్కలను నాటాడు. ఈ వెదురులో బల్కోవ, న్యూటన్స్, బ్యాంబుస, పాలిమర్ఫా, కిమోనో, బెరిపెరా వంటి రకాలను సాగు చేస్తున్నాడు. మొక్క నాటిన నాలుగేళ్ల తర్వాత మొదటి కోత వస్తుంది.



వెదురుతో తయారు చేసిన వస్తువు

● అన్ని నేలలకు అనుకూలం..

వెదురు దాదాపు అన్ని నెలలకు అనుకూల మైంది. మొక్క నాటిన నుంచి నాలుగే ఏళ్ల త ర్వాత దిగుబడి మొదలువుతుంది. 70 ఏళ్ల పాటు నిరంతరం దిగుబడి లభించే అవకాశం ఉందని చెబుతున్నారు. వెదురు మొక్క రకాన్ని బట్టి 50 నుంచి 60 అడుగుల ఎత్తు వరకు పెరుగుతుంది. ఏటా ఎకరానికి 20 నుంచి 30 టన్నుల వరకు దిగుబడి ఇస్తుంది. వెదురులో దాదాపు వందకు పైగా రకాలు ఉన్నప్పటికీ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న రకాలనే సాగు చేస్తున్నారు. వెదురు సాగుకు పెట్టుబడి వ్యయం తక్కువ. చీడ పురుగులు, తెగుళ్ల బెడద ఉండదు. అందుకే వెదురు సాగుపై దృష్టి సారించానని రైతు తెలిపారు.

పదెకరాల్లో సాగు..

- దాసరి రఘు, రైతు, బెల్లంపల్లి



రెండేళ్ల క్రితం మహారాష్ట్ర నుంచి వివిధ రకాల వెదురు మొక్కలను తీసుకువచ్చి పది ఎకరాల్లో సాగు చేస్తున్నాను. ప్రస్తుతం వెదురు సాగు మంచి ఆశాజనకంగా ఉంది. మరో మూడేళ్ల తర్వాత పంట దిగుబడి వస్తుంది. ఈ సాగుకు ఎరువులు, పురుగుల మందులు అవసరం లేదు.

పోలీసులకు సేవా పతకాలు



రాజన్న, గోపాల్



వెంకటేశ్వర్లు

హాజీపూర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రతిభ చాటిన పోలీసు అధికారులు, సిబ్బందికి నూతన సంవ త్సరం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పతకాలను ప్రకటించింది. గుడిపేటలోని 13వ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆర్ఎస్ఐ రాజన్న, ఏఆర్ఎస్ఐలు గోపాల్, సంతోష్, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లుకు ఉత్తమ సేవా పతకాలు లభించాయి. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములు వారిని అభినందించారు.

తెలంగాణ దివ్యాంగుల వేదిక జిల్లా అధ్యక్షుడిగా సుమన్

కాసిపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ దివ్యాంగుల వేదిక జిల్లా అధ్యక్షుడిగా కాసిపేటకు చెందిన నగురారపు సుమన్ నియమితులయ్యారు. బుధవారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో సుమన్‌కు రాష్ట్ర అధ్యక్షుడు మేకల సమ్మయ్య నియామక పత్రం అందజేశారు.

ఘనంగా మల్లన్న పట్నాలు

కాసిపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ముత్యంపల్లికి చెందిన బోయిని పరివారం ఆధ్వర్యంలో బుధవారం మల్లన్న పట్నాలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసి బోనాలను సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు

మందమర్రిటౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి నూతన సంవత్సరంలో మరిన్ని నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాను ఎమ్మెల్యేగా పదవీ బాధ్యలు చేపట్టిన తర్వాత వందల కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టానని పేర్కొన్నారు. పాఠశాలల ఆధునికీకరణ, ఆసుపత్రుల్లో పడకల పెంపు చేపట్టామని తెలిపారు. చెన్నూరు, క్యాతనపల్లి, మందమర్రి మున్సిపాలిటీల్లో ప్రజల సంక్షేమానికి అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులను చేసినట్లు తెలిపారు. క్యాతనపల్లి రైల్వే బ్రిడ్జి పనులు త్వరలో పూర్తవుతాయని , దీంతో ప్రయాణం సులభతరం కానుందని తెలిపారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా క్యాతనపల్లి, మందమర్రి మున్సిపాలిటీల్లో అమృత పథకంలో రూ. 30.50 కోట్లతో పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. నియోజ కవర్గంలో సమస్యలుంటే తన దృష్టికి తీసు కువస్తే వాటిని పరిష్కరిస్తానని ప్రజలను కోరారు. ప్రజా ప్రభుత్వం అధికారంలో ఉందని, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తాము పని చేస్తామని తెలిపారు. అందరికి కలుపుకుని వెళుతూ అభివృద్ధి పాటుపడుతామని తెలిపారు.

ఆదర్శం మందగూడ గ్రామం

● చెత్త సేకరణతో ఆదాయం ● సత్ఫలితాలు ఇస్తున్న ప్రభుత్వ ఆశయం



సెగ్రిగేషన్ షెడ్‌లో నిలువ ఉంచిన ప్లాస్టిక్ బాటిళ్లు, బీరు సీసాలు

తిర్యాణి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పచ్చదనంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వ వివిధ పథకాలను ప్రవేశపెట్టింది. గ్రామపంచాయ తీలకు ట్రాక్టర్లు, సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణాలను చేపట్టారు. ట్రాక్టర్‌లద్వారా చెత్త సేకరించి సేగ్రిగేషన్ షెడ్‌లలో చెత్తను వేరు చేసి పంచాయతీలకు ఆదాయం చేకూర్చటం ప్రభుత్వ ఉద్దేశ్యం. కానీ క్షేత్రస్థాయిలో మెజార్టీ పంచాయతీల్లో పరిశుభ్రత పనులు నామమాత్రంగానే సాగుతున్నాయి. దీంతో చెత్త ద్వారా అదనపు ఆదాయం సమకూర్చుకోవాలనే ప్రభుత్వం లక్ష్యం నెరవేరడం లేదు. అయితే మండలంలో కేవలం 440 జనాభాకలిగిన మందగూడ గ్రామ పంచాయతీ మాత్రం ప్రభుత్వ ఆశయాన్ని వందశాతం అమలు చేసే ఉద్దేశ్యంతో ముందుకు వెళ్తోంది. చెత్త చేకరణ ద్వారా అదనపు ఆదాయం పొందుతూ ఆదర్శంగా నిలుస్తోంది.

ఆరు నెలల్లో రూ.18వేలు..

మందగూడ గ్రామ పంచాయతీలలో మల్టీపర్పస్‌వర్కర్లు ఆరునెలల సేకరించిన చెత్తను ఇటీవల విక్రయించగా రూ.18వేల ఆదాయం వచ్చింది. ఇందులో



మందగూడ గ్రామం

ఎక్కువగా గాజుసీసాలు, ప్లాస్టిక్ వస్తువులతోపాటు ఇతర చెత్తసామాగ్రి ఉంది. మందగూడ గ్రామపంచాయతీలో ప్రముఖంగా చింతలమాదర జలపాతం ఉంది. వర్షాకాలంలో ఇక్కడికి వచ్చిన సందర్శకులు వదిలేసిన వ్యర్థాలపై పంచాయతీ సిబ్బంది దృష్టి సారించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో భాగాంగా ఆ ప్రాంతంలోని ప్లాస్టిక్ ఇతర చెత్తను సేకరించారు. సేకరించిన చెత్తనుంచి రీసైక్లెబుల్ చెత్తను విక్రయించి ఆదాయం పొందడంపై దృష్టి సారించారు.

ప్రతిరోజు చెత్త సేకరణ..

- తుంరం గోపాల్, ఈటీసీ చైర్మన్, మందుగూడ



మా పంచాయతీ పరిధిలో మల్టీపర్పస్ సిబ్బంది క్రమంగా తప్పకుండా చెత్తను సేకరిస్తారు. సేకరించిన చెత్తను సెగ్రిగేషన్ షెడ్డులో వేరు చేస్తారు. పంచాయతీ పరిధిలో చింతల మాదర జలపాతం ఉండడంతో పెత్త మొత్తంలో చెత్త సేకరణ జరుగుతోంది.

ఆదాయం సమకూరుతోంది..

- చిత్రం రావు, మల్టీపర్పస్ వర్కర్



ప్రస్తుతం పంచాయతీలకు పాలక వర్గాలు లేకపోవడంతో తక్కువ మొత్తంలోనే నిధులు విడుదల అవుతున్నాయి. ఈ నేపథ్యంలో చెత్త అమ్మకం ద్వారా వచ్చిన అదనపు ఆదాయం గ్రామాభివృద్ధికి తోడ్పడుతోంది.

జనరల్ ఫండ్లలో జమ చేశాం..

- సురేష్, పంచాయతీ కార్యదర్శి

పంచాయతీ పరిధిలో ఆరునెలలుగా సేకరించిన చెత్తను ఇటీవల అమ్మగా రూ.18వేల ఆదాయం వచ్చింది. వీటిని పంచాయతీ జనరల్ ఫండ్‌లో జమ చేశాం. వీటిని గ్రామ పంచాయతీలో చిన్నచిన్న అవసరాలకు, అత్యవసర సమ యంలో సిబ్బందికి వేతనాలు అందించడానికి వినియోగించుకుంటున్నాం.

అధ్యాపకుడికి పీహెచ్‌డీ ప్రదానం



తిరుపతికి పీహెచ్‌డీ ప్రదానం చేస్తున్న ప్రొఫెసర్లు

దండెపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): లక్సెట్టిపేట ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్ లెక్చరర్‌గా పని చేస్తున్న మోటపలుకుల తిరుపతికి కరీంనగర్ జిల్లా శాతవాహన విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ డాక్టరేట్ ఇటీవల ప్రదానం చేసింది. శాతవాహన విశ్వవిద్యాలయంలో ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న ప్రొఫెసర్, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ యం వరప్రసాద్ పర్యవేక్షణలో కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని స్వయం సహాయాక బృందాల ద్వారా మహిళా సాధికరత అనే అంశంపై తిరుపతి పరిశోధన చేశారు. స్వయం సహాయాక సంఘాలు మహిళల అభివృద్ధి, వారి ఆర్థిక స్థితిగతులు ఆరోగ్యం, విద్య, జీవన ప్రమాణాలు మెరుగపడడానికి తగిన సూచనలు, సలహాలు అందించారు. తెలంగాణ ఆర్థికాభివృద్ధిలో స్వయం సహాయక సంఘాల యొక్క ప్రాముఖ్యతను, అందుకు ప్రభుత్వం, బ్యాంకులు చేస్తున్న కృషిని వివరించడంతో డాక్టరేట్ అందజేశారు. తిరుపతిని యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఉమేష్‌కుమార్, పర్యవేక్షకులు వరప్రసాద్, మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహాత్మా సంతోష్ తదితరులు ఈ సందర్భంగా అభినం దించారు.

బాధితురాలికి ఆర్థిక సాయం

కాసిపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల క్రితం దేవాపూర్‌లోని అచ్యుతరావుగూడెంలో అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయిన బాధితురాలు సత్తుబాయికి బుధవారం ఇప్పలగూడెం పూలాజీబాబా ధ్యాన కేంద్రం సభ్యులు రూ. 5 వేల నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో పెంద్రం రాజు, వెడ్మ బాబు రావు, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.



వెదురు సాగుతో లాభాల పంట

- ఒకసారి నాటితే ఏళ్ల తరబడి రాబడి
- చీడ పీడలు, తెగుళ్ల బెడద తక్కువే
- ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరింత ప్రయోజనం



రైతు సాగు చేసిన వెదురు

7

దీపమే జంగుబాయి రూపం

ఆదివాసీల ఆరాధ్య దైవం జంగుబాయి

- ప్రారంభమైన జాతర
- నేటి నుంచి నెలరోజుల పాటు ఉత్సవాలు



జంగుబాయి క్షేత్ర గుహలు

6

ఘనంగా భీమాకోరేగావ్ విజయ్ దివస్

మంచిర్యాల క్రైం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలో భీమా కోరేగావ్ శౌర్య విజయ్ దివస్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరుల స్థూపానికి పూల మాలలు వేసి కొవ్వొత్తులతో యుద్ధవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేషం, దుర్గం స్వామి, డాక్టర్ నీలకంఠేశ్వర్ గౌడ్, గొడిసెల దశరథం తదితరులు పాల్గొన్నారు.

జన్నారం: భీమా కోరెగావ్ పిస్వా బ్రహ్మణ సైన్యంపై విజయం సాధించడంలో వీర మరణం పొందిన మహర్ సైనికులకు బుధవారం మండల కేంద్రంలోన్ని ప్రత్యేకంగా తయారు చేసిన మహర్ అమ రవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీబీసీ, మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అభ్యర్థి ఆత్రం సుగుణ, నాయకులు రాజలింగం, ప్రభుదాస్, భరత్, శ్రీనివాస్‌కుమార్, తాజ్, మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్, రాజేషశ్వర్, వెంకట్, మల్లేష్, సురేష్ పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే

మందమర్రిటౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం భీమా కోరెగావ్ శౌర్య విజయ్ దివస్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పాల్గొన్నారు. అంతకుముందు ఆయన అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భీమా కోరెగావ్ పోరాటానికి 200 సంవత్సరాలకు పైగా చరిత్ర ఉందని తెలిపారు. మహారాష్ట్రలోని భీమా నది ఒడ్డున జరిగిన పోరాటంలో ఎంతో మంది దళితులు అమరుల య్యారని అన్నారు. ఈ ఘటనలో ప్రాణత్యాగం చేసిన వారికి నివాళులర్పించామని వివరించారు.

సెల్లార్లపై చూపు

- సెల్లార్లలోని షాపులతో రోడ్లపైనే వాహనాలు
- రాకపోకలకు ప్రజల అవస్థలు
- తొలగింపునకు అధికారుల నోటీసులు

మంచిర్యాల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో వాహనాల పార్కింగ్‌కు స్థలం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సెల్లార్ షాపులను ఖాళీ చేయించడంపై- మున్సిపల్ అధికారులు దృష్టి సారించారు. జిల్లా కేంద్రంగా ఏర్పడ్డ నాటి నుంచి వాహనాల రాకపోకలతో రోడ్లన్నీ రద్దీగా మారాయి. అంతర్గత రోడ్లయితే ప్రజలు నడువలేని విధంగా కిక్కిరిసి పోతున్నాయి. ముఖ్యంగా పండుగలు, ప్రత్యేక దినాల్లో విపరీతమైన రద్దీ నెలకొంటుంది. పట్టణ ప్రజలతోపాటు వివిధ పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చిపోయే ప్రజల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. పెరిగిన జనసంచారానికి అనుగుణంగా రోడ్లను విస్తరించకపోవడంతో ఇంతకాలం వాహనాల పార్కింగ్ పెద్ద సమస్యగా తయారైంది. కార్ల లాంటి వాహనాల్లో ప్రధాన కూడళ్లకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఎక్కడో కిలోమీటర్ల దూరంలో వాహనాలు ని లిపి ప్రధాన సెంటర్లకు వెళ్లాల్సి వస్తోంది. ప్రజలు ఇబ్బంది పడుతున్నందున ఎమ్మెల్యే ప్రేం సాగర్‌రావు సూచనతో కబ్జాలకు గురైన అంతర్గత రోడ్ల విస్తరణకు అధికారులు నడుం కట్టారు.



సెల్లార్‌లో ఏర్పాటు చేసిన దుకాణాలు



రోడ్డు ఆక్రమణలను తొలగించిన అధికారులు (ఫైల్)

బహుళ అంతస్తుల భవనాలు..

మంచిర్యాల మున్సిపాలిటీలో బహుళ అంతస్తుల భవనాల సెల్లార్‌లను భవనాల యజమానులు అద్దెకు ఇవ్వడంతో పార్కింగ్ సమస్య తలెత్తుతోంది. మున్సిపల్ నిబంధనల ప్రకారం భవనాల సెల్లార్లను వాహనాల పార్కింగ్ కోసం వదిలివేయాలి. దీనికి భిన్నంగా సెల్లార్‌లలో సైతం షాపింగ్ మాల్స్, ఇతర వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో వాహనాలు రోడ్ల పక్కన పార్క్ చేయాల్సి వస్తోంది. అసలే ఇరుకు రోడ్లు కావడం, వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు తమ వాహనాలను రోడ్ల పక్కన నిలుపుతుండటంతో విపరీతమైన రద్దీ నెలకొంటుంది. పట్టణంలో ఎక్కడ చూసినా సెల్లార్‌లను వ్యాపార నిమిత్తం ఉపయోగించే సందర్భాలే కనిపిస్తాయి.

ప్రధాన సెంటర్లయిన మార్కెట్ రోడ్డు, వెంకటేశ్వర టాకీస్ రోడ్డు, వాటర్ ట్యాంక్ ఏరియా, గంగారెడ్డి రోడ్డులో సెల్లార్లను వ్యాపార నిమిత్తం ఉపయోగించడం గమనార్హం. వాహన పార్కింగ్ కోసం ఉద్దేశించిన సెల్లార్లను భవనాల యజమానులు అద్దెకు ఇస్తూ వేలకు వేలు సంపాదిస్తున్నారు. సెల్లార్‌లను ఖాళీ చేయించి, వాటిని పార్కింగ్ స్థలాలుగా ఉపయోగిస్తే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండే అవకాశం ఉండటంతో అధికారులు చర్యలకు ఉపక్రమించారు. కూరగాయల మార్కెట్ సమీపంలోని పాత మటన్ మార్కెట్ కాంప్లెక్స్‌లో నూతనంగా నిర్మించిన భవనం సెల్లార్‌లో పార్కింగ్ ఏర్పాటు చేస్తామని గతంలో మున్సిపల్ అధికారులు తెలిపారు. కాగా భవన నిర్మాణం పూర్తయి ఏళ్లు గడుస్తున్నా సెల్లార్ ఖాళీగా ఉందేగానీ, పార్కింగ్ కోసం వినియోగించడంలో మాత్రం జాప్యం జరుగుతోంది. భవనం సెల్లార్‌ను పార్కింగ్ కోసం వినియోగిస్తే మార్కెట్ ఏరియాలో వాహనాల రద్దీ తగ్గి, ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది.

రోడ్డు ఆక్రమణలపై..

జిల్లా కేంద్రంలోని ప్రధన వీధుల్లో రోడ్ల ఆక్రమణలపై మున్సిపల్ అధికారులు తీవ్ర స్పందిస్తున్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ప్రధానంగా బాలుర ఉన్నత పాఠశాల, మార్కెట్ రోడ్డు, అర్చన టెక్స్ చౌరస్తా,

మిగతా 7వ పేజీలో

బ్లాంకెట్లు అందజేత



కలెక్టర్‌కు బ్లాంకెట్లు అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

గర్మిళ్ల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా మంచిర్యాల ఇండి యన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు బుధవారం జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్‌కు తన కార్యాలయంలో బ్లాంకెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి, స్టేట్ మేనేజింగ్ కమిటీ మెంబర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ నూతన సంవత్సరం కొత్తగా ఉండాలనే ఆలోచనతో 40 ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పేరుతో ఉన్న బ్లాంకెట్‌లను చలితో ఇబ్బందులు పడు తున్న పేదలకు అందజేయాలని కలెక్టర్‌కు అందజేశామని తెలిపారు. కలెక్టర్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో కార్యదర్శి చందూరి మహేందర్, కోశాధికారి సత్యపాల్ రెడ్డి, కాసర్ల శ్రీనివాస్, ముల్కల సత్యనారాయణరెడ్డి, శంకర్ వర్మ, హరీష్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్‌కు పూల మొక్కను అందజేస్తున్న టీఎన్‌జీవో నాయకులు

గర్మిళ్ల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని టీఎన్‌జీవో నాయకులు కోరారు. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని బుధవారం టీఎన్‌జీవో నాయకులు కలెక్టర్ కుమార్ దీపక్, అడిషనల్ కలెక్టర్ మోతిలాల్, ఆర్డీవో శ్రీనివాసరావు, హరికృష్ణలను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి రామ్మోహన్, మల్లయ్య, బాపురావు, సతీష్‌కుమార్, శ్రీనివాస్, కేజియా రాణి, తిరుపతి, సునీత, యూసఫ్, గోపాల్, సుమన్, సతీష్, వెంకటేష్, పద్మజ పాల్గొన్నారు.

వంట పాత్రలు అందజేత



అయ్యప్ప స్వాములకు వంటపాత్రలు అందజేస్తున్న దాతలు

శ్రీరాంపూర్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ భక్తాంజనేయ స్వామి ఆలయం ఆవరణలో ఉన్న అయ్యప్ప సన్నిధానానికి శ్రీరాంపూర్‌కు చెందిన ఓ కుటుంబం రూ. 16 వేల విలువైన వంట పాత్రలు అందజేసింది. టిఫిన్ సెంటర్ నడిపే దాసరి శ్రీరాములు, సుజాత, బన్నీ, సన్నీలు సన్నిధానం ఆవరణలో పాత్రలు అందజేశారు. అయ్యప్ప స్వామి పూజ, అన్నదానం చేసేందుకు ఈ పాత్రలు వినియోగించు కోవాలని కోరారు. కార్యక్రమంలో అయ్యప్ప సన్నిధానం అధ్యక్షుడు బొడ్డు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి భాస్కరి రాజేశం, సాదినేని సతీష్, గాదాసు రాజు, బొద్దున రమేష్, ముల్కల్ల రవికృష్ణ, బజ్జూరి లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

23వ రోజుకు చేరిన సమ్మె



ఎస్ఎస్ఏ ఉద్యోగులకు మద్దతు తెలుపుతున్న బీజేపీ నాయకులు

నస్పూర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారం నాటికి 23వ రోజుకు చేరుకుంది. తమ హక్కుల సాధన కొరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేయనున్నట్లు జేఏసీ అధ్యక్షురాలు సుమలత, ప్రధాన కార్యదర్శి రాజన్న తెలిపారు. శిబిరాన్ని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొయ్యాల ఏమాజీ, జిల్లా నాయకులు మధుసూదన్‌రావు, లింగంపల్లి విజయ్ కుమార్, ప్రగతిశీల ఆర్గనైజేషన్ కమిటీ జిల్లా నాయకుడు మంతెన మల్లన్న, పీవోడబ్ల్యూ రాష్ట్ర మహిళా సంఘం నాయకులు మంగ, అరుణ, టీఎన్‌జీవో సంఘం నాయకులు శ్రీహరి, బాబురావు, మల్లయ్య, నాగేందర్, తిరుపతి, సునిత సందర్శించి మద్దతు తెలిపారు.

బదిలీపై వెళ్తున్న ఉద్యోగికి సన్మానం

భీమిని, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : భీమిని పోలీస్ స్టేషన్‌లోఐదేళ్ల రైటర్‌గా విధులు నిర్వహిస్తున్న రాజ్‌కుమార్ బదిలీపై వెళ్తుండడంతో బుధవారం పోలీసులు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి సన్మానించారు. ఎస్సై విజయ్‌కుమార్ మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగం అనేది అన్ని ప్రభుత్వ ఉద్యోగాలకంటే కీలక మైనదని చెప్పారు. ఇంత కాలం ఇక్కడ క్రమశిక్షణతో పట్టుదలతో పనిచేసి మంచి పేరు సాధించడం ఎంతో గర్వకారణమని కొనియాడారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారులు న్యాయం చేయాలి

కాసిపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : అధికారులు దళారుల నుంచి తమ భూమిని కాపాడి న్యాయం చేయాలని కాసిపేటకు చెందిన వృద్ధ దంపతులు ఇనిగంటి సత్యనారాయణరావు- పద్మ అనే వ్యక్తులు కోరారు. బుధవారం కాసిపేట ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. ఎనిమిదేళ క్రితం మండలంలోని ముత్యంపల్లి పంచాయతీ గురువాపూర్ శివారులోని సర్వే నంబరు 74/1, 74/1/1లో 49.34 ఎకరాల భూమిని కొనుగోలు చేశామని తెలిపారు. ఇందులో నుంచి 22.12 ఎకరాల భూమిని తమ పేరు మీద పట్టా చేసి పట్టా పాస్‌బుక్‌లు ఇచ్చారని తెలిపారు. మిగితా 27 ఎకరాల భూమిని మ్యుటేషన్ చేయకుండా రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం చేశారన్నారు. దీంతో ఇటీవల కొందరు దళారులు భూమిని కబ్జా చేశారని, భూమిలోకి వెళితే చంపేస్తామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తహసీల్దార్‌కు, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించు కోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సమ్మెలో ఎస్ఎస్ఏలు

- కేజీబీవీల్లో నిలిచిన బోధన
- ఆందోళనలో విద్యార్థినులు



కలెక్టరేట్ ఎదుట సమ్మె చేస్తున్న సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు

జైపూర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో బోధిస్తున్న ఎస్‌వోలు, సీఆర్‌టీలు సమ్మెలో ఉండడంతో 23 రోజులుగా చదువులు కుంటు పడ్డాయి. కేజీబీవీల్లో ప్రస్తుతం విద్యార్థినులకు భోజనం అందించడంతోనే సరిపెడుతున్నారు. చదువులు చెప్పేవారు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పట్టించుకోవడం లేదని విద్యార్థినుల భవిష్యత్‌పై సైతం దృష్టి సారించడం లేదని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.. ప్రస్తుతం కేజీబీవీల్లో విద్యార్థినులను ఉంచడంతో ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో ఇంటికి తీసుకువెళ్లేందుకు తల్లిదండ్రులు సిద్ధమవుతున్నారు. జిల్లాలో 18 కేజీబీవీలు ఉండగా 4,200 మంది విద్యార్థినులు చదువుతున్నారు.

ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నాం..

కేజీబీవీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు సమ్మెలో ఉండడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యామ్నాయ చర్యలను చేపడుతున్నాం. కొంత మంది టీచర్లకు తాత్కాలిక ఎస్‌వోలుగా బాధ్య తలు అప్పగించాం. ప్రస్తుతం కొంత మంది గెస్ట్ టీచర్లు కూడా పనిచేస్తున్నారు. వీరితో పాటు ఇటీవల నియా మకమైన సీఆర్‌టీలతో విద్యాబోధన సాగుతుంది. విద్యార్థినులు ఇంటికి వెళ్లడం లేదు.

- యశోద, జిల్లా సెక్టోరియల్ అధికారి

- పరీక్షలు సమీపిస్తుండడంతో..

మరో మూడు నెలల్లో వార్షిక పరీక్షలు సమీపిస్తుండడంతో విద్యార్థినులు ఆందోళన చెందుతు న్నారు. కేజీబీవీల్లో చదివేది పేద విద్యార్థినులే. ఇందులో ఎక్కువ శాతం మంది తల్లిదండ్రుల కుటుంబ ఆర్థిక పరిస్థితులు , ఇతర సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారిని పిల్లలు ఇక్కడ చదువుతున్నారు. చదువు మధ్యలో ఆపేసిన వారిని కేజీబీవీల్లో చేర్పిస్తున్నారు. ప్రస్తుతం పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు సమీపిస్తున్నాయి. కేజీబీవీ పాఠశాలల్లో ఇంకా సిలబస్ పూర్తి కాలేదు. 23 రోజులుగా సీఆర్‌టీలు సమ్మెలో ఉండడంతో బోధన జరగడం లేదు. దీంతో తమ పిల్లల భవిష్యత్ ఏమవుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. విద్యాశాఖ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. కాగా కేజీబీవీల్లో భోజనం కోసం సరుకుల బాధ్యత ప్రత్యేక అధికారుది. తమ దగ్గర ఉన్న డబ్బులతో మొదట సరుకులను కొనుగోలు చేసి ఆ తర్వాత బిల్లులు సమర్పిస్తారు. 23 రోజులుగా కేజీబీవీలకు వెళ్లకపోవడంతో సరుకులు దగ్గర పడ్డాయి. దీంతో విద్యార్థినీలకు మెను ప్రకారం భోజనం అందని పరిస్థితి నెలకొంది. నైట్ వాచ్ మెన్‌ల పర్యవేక్షణలో విద్యార్థినులు ఉంటున్నారు.

రంగసముద్రం చెరువు మత్తడి ధ్వంసం

తాండూర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): తాండూర్ మండలంలోని కాసిపేట రంగసముద్రం చెరువు మత్తడిని మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీంతో చెరువులోని నీరంతా వృథాగా పోతుండడంతో ప్రజలు ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించారు. బుధవారం తూము వద్దకు చేరుకున్న ఇరిగేషన్ సిబ్బంది నీరు వృథాగా పోకుండా మట్టి బస్తాలు నింపి ప్రత్యామ్నాయ మరమ్మతులు చేపట్టారు. తూమును ధ్వంసం చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

న్యూ ఇయర్ వేడుకలు

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- అధికారులకు పలువురి శుభాకాంక్షలు



గూడెంలో సత్యదేవుడి ఆలయంలో క్యూలైన్‌లో ఉన్న భక్తులు

మంచిర్యాలకలెక్టరేట్/దండేపల్లి/మందమర్రిరూరల్/భీమారం/కాసిపేట/జన్నారం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నూతన సంవత్సరం వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఇళ్ల ముందు మహిళలు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్త సంవత్సరంలో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేందుకు కార్యక్రమాలు నిర్వహించారు. నూతన సంవత్సరం సందర్భంగా హోటల్లు, రెస్టారెంట్లు కిటకిటలాడాయి. కలెక్టర్ , ప్రభుత్వ అధికారుల కార్యాలయాల్లో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలందరికి మంచి జరగాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. దండేపల్లి మండలంలోని ఆలయాల్లో బుధవారం భక్తుల సందడి నెలకొంది. గూడెం శ్రీసత్యనారాయణ స్వామి ఆలయం, అయ్యప్పస్వామి, పంచ ముఖి అంజనేయస్వామి, సదనంద ఆలయం, మ్యాదరిపేటలోని శ్రీలక్ష్మీనారయణస్వామి, నర్సాపూర్‌లోని శ్రీభ్రమరాంబిక, ద్వారకశివాలయం, దత్తాత్రేయ ఆలయాల్లో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. మందమర్రి మండలం వెంకటాపూర్ గ్రామంలోని చర్చిలో పాస్టర్ గంధం కెన్ని ప్రసాదరావు కేక్ కట్ చేశారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



మందమర్రి మండలం వెంకటాపూర్‌లోని చర్చిలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్ ప్రసాదరావు, గ్రామస్థులు